

6 నుంచి ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టుల పరిశీలన



ప్రజాశక్తి -పెనుకొండ

హంద్రీనీవా ప్రాజెక్టు పనుల పరిశీలన, ఆగిపోయిన పనులు, రైతులకు నష్టపరిహారం చెల్లించని విషయాలను తెలుసుకునేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా టిడిపి ఆధ్వర్యంలో ప్రాజెక్టుల పరిశీలన చేయనున్నట్లు టిడిపి జిల్లా అధ్యక్షుడు బికె.పార్థసారథి తెలిపారు. తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, రాష్ట్ర నాయకులు మూడు రోజుల పాటు హంద్రీనీవా ప్రాజెక్టులను సందర్శిస్తారని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మూడు రోజుల పర్యటనకు ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. ఈ నెల 6వ తేదీన పుట్టపర్తి, ధర్మవరానికి సంబంధించిన జిల్లేడుబండ ప్రాజెక్టు సందర్శన, 7న మడకశిర నియోజకవర్గం, 8న రాప్తాడు నియోజకవర్గం పేరూరు హంద్రీనీవా ప్రాజెక్టును నాయకులు పరిశీలన చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, రైతులు పాల్గొని వారి పరిధిలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల సమస్యలను వివరించాలని అయన కోరారు.

పేదోళ్ల పెద్ద మనసు..!

◆ బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయదానం

◆ వివిధ ప్రాంతాలకు తరలించిన వైద్యబృందం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రెక్కడితేగాని డొక్కాడని పేద కుటుంబాలవి... అయితేనేమి మానవత్వంలో పెద్ద మనసు తమకుందని చాటుకున్నారు. బ్రెయిన్‌డెడ్ అయిన యువకుడి అవయవాలను దానం చేసి తమ కుటుంబ సభ్యుడు చనిపోయినా మరో నలుగురికి జీవితాన్ని అందించిన వారమవుతామంటూ ఆ యువకుడి శరీర భాగాలను దానం చేశారు. మరణించిన తర్వాత కూడా ఆయన శరీరం నలుగురికి ఊపిరిపోసింది. బ్రెయిన్‌డెడ్‌తో ఆయన చనిపోయినా అవయవదానంతో జీవించాడు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, బ్రెయిన్ డెత్ స్థితికి చేరుకున్న ఓ మేస్త్రి కుటుంబం చూపిన పెద్ద మనసు నలుగురి జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది. ఈ ఘటన శుక్రవారం నాడు అనంతపురం నగరంలో చోటు చేసుకుంది.



మృతి చెందిన జగదీష్(ఫైల్ ఫొటో)

బ్రెయిన్‌డెడ్ అయిన జగదీశ్ అవయవాలు దానం

బుక్కరాయసముద్రానికి చెందిన జగదీశ్(30)అనే యువకుడు తాపిమేస్త్రీ పని చేసుకుని జీవనం సాగించేవాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. తాపిమేస్త్రి పని చేయడం ద్వారానే కుటుంబ జీవాన్ని సాగించే వాడు. ఆగస్టు 1వ తేదీన కూడా ఈ పనికి వెళ్లి వస్తున్న సమయంలోనే అనంతపురం రూరల్ పరిధిలోని తడకలేరు వద్ద బైకు అదుపుతప్పి కిందపడటంతో తలకు తీవ్రమైన గాయమైంది. తలలో తీవ్రమైన రక్తస్రావం కావడంతో బ్రెయిన్‌డెడ్ అయింది. జగదీశ్‌ను కాపాడుకునేందుకు కుటుంబ సభ్యులు మొదట ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సవేరా ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆయన్ను కాపాడేందుకు వైద్యులు అన్ని రకాల ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేదని తేలింది. బ్రెయిన్ డెడ్ అయిన కోలుకోలేని పరిస్థితి రావడంతో జీవన్‌దాన్ కింద అవయవాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు.

గ్రీన్ ఛానల్ ద్వారా అవయవాల తరలింపు

కుటుంబ సభ్యులు అవయవ దానానికి అంగీకరించడంతో జగదీశ్ శరీరం నుంచి మూత్రపిండాలు, ఊపరితీత్తులు, కాలేయాలను సేకరించి ఇతరులకు అమర్చేందుకు సవేరా వైద్యులు ఉపక్రమించారు. మూత్రపిండాలు రెండింటిలో ఒకటి సవేరా ఆసుపత్రిలోనే ఆరోగ్యశ్రీ కింద ఒకరికి అమర్చారు. మరోకటి కర్నూలు సర్వజన ఆసుపత్రికి తరలించారు. కాలేయాన్ని విశాఖపట్నానికి, ఊపరితిత్తులను హైదరాబాద్‌కు తరలించారు. ఈ అవయవాలను గ్రీన్‌ఛానల్ ద్వారా అంటే ప్రత్యేకమైన అంబులెన్స్‌ల్లో కర్నూలు విమానాశ్రాయనికి తీసుకెళ్లి అక్కడి నుంచి వైజాగ్, హైదరాబాద్‌కు తరలించారు. ఇలా ఒక వ్యక్తి అవయవాలను నలుగురికి అమర్చేందుకు వీలుపడింది.



గ్రీన్‌చానెల్ ద్వారా అవయవాలు తరలిస్తున్న సవేరా వైద్యులు

నాలుగోసారి తమ ఆసుపత్రి నుంచి ఇచ్చాం

బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల అవయవాదనం సవేరా ఆసుపత్రి నుంచి చేయడం ఇది నాలుగోసారి. జీవన్‌దాన్ కింద రిజిస్టర్డ్ అయిన ఆసుపత్రులు, అదే రకంగా రిజిస్టర్డు రోగులకు ఈ రకంగా బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల అవయవాలను మరొకరికి అమర్చడం జరుగుతుంది.

హబీబ్ రాజా, మెడికల్ సూపరింటెండ్ సవేరా.

ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోవడంతోనే

జగదీశ్‌ను రక్షించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేశాం. కాని ఫలితం లేకపోయింది. బ్రెయిన్‌డెడ్ కోలుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు అవయవాలను సేకరించి మరొకరికి అమర్చేందుకు వేరువేరు ప్రాంతాలకు పంపించాం.

చంద్రశేఖర్, వైద్యులు సవేరా .

మరికొందరికైనా ఉపయోగపడాలనే ఈ నిర్ణయం : జగదీశ్ కుటుంబ సభ్యులు

జగదీశ్‌ను రక్షించేందుకు వైద్యులు అన్ని రకాల ప్రయత్నాలూ చేశారు. కాని ఫలితం కనిపించలేదు. బ్రెయిన్‌డెడ్ అయినట్టు నిర్ధారించారు. ఈ క్రమంలోనే వైద్యులు, ఇతర అవయవదానం చేస్తే కొంత మందికైన జీవం పోయవచ్చునని చెప్పడంతో తమ కుటుంబ సభ్యులం అందరం చర్చించుకుని అవయవదానికి అంగీకరించాం. మా వాడి వలన మరో నలుగురి ఆరోగ్యాలు బాగుపడతాయన్న ఉద్దేశ్యంతో దీనికి అంగీకరించాం.

పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికుల పోరుబాట

◆ సత్యసాయి కలెక్టరేట్ ముట్టడి

◆ రహదారిపై పొర్లుదండాలతో నిరసన

◆ సిఐటియు నాయకులు, కార్మికుల అరెస్టు



కార్మికులు, సిఐటియు నాయకులను అరెస్టు చేయడంతో పోలీస్ వాహనాన్ని చుట్టుముట్టిన మహిళలు కార్మికులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సమస్యల పరిష్కారంపై పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికులు పోరుబాట పట్టారు. శుక్రవారం ఉదయం కార్మికులు పెద్ద ఎత్తున కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. సిఐటియు, పంచాయతీ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో రహదారిపై పండుకుని నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని.. జీతాలు ఇవ్వకుంటే జైలుకైనా సిద్ధం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్, పంచాయతీ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీలలో మూడు నెలల నుంచి 18 నెలల వరకు వివిధ దశలో వేతనాలు కార్మికులకు ఇవ్వాల్సి ఉందన్నారు. కష్టపడి పనిచేస్తున్న కార్మికులకు జీతాలు ఇవ్వకుంటే వారి కుటుంబాలు ఏమి తిని బతకాలని ప్రశ్నించారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. హైకోర్టు తీర్పు మేరకు తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు, స్వచ్ఛభారత్ కార్మికులకు 10 వేలు వేతనం ఇవ్వాలన్నారు. పంచాయతీ కార్మికులను గ్రీన్ అంబాసిడర్లుగా గుర్తించి నెలకు 6 వేలు హెల్త్ అలవెన్స్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2132, 680 జీవోలను అమలు చేయాలన్నారు. ప్రమాదంలో మతి చెందిన కార్మిక కుటుంబాలకు 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. సాధారణంగా మతి చెందితే 5 లక్షలు ఇవ్వాలని కోరారు. అనంతరం నిరసనకారుల వద్దకు డిఆర్ఒ కొండయ్య వచ్చి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి వినతిపత్రం తీసుకుంటూ ఈనెల 9న కలెక్టర్‌తో మాట్లాడి ఒక సమావేశం ఆరోజు నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్మికులు వినకుండా, రహదారిపె పొర్లుదండాలు పెట్టారు.

నాయకులు అరెస్ట్... ప్రతిఘటించిన మహిళా కార్మికులు..

కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులను ఆందోళన విరమించాలంటూ సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి వారిని కోరారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించేంత వరకు ఆందోళన విరమించమంటూ కార్మికులు సిఐకి స్పష్టం చేశారు. దీంతో పోలీసులు సిఐటియు, పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు ఈఎస్.వెంకటేష్, రమేష్, ప్రవీణ్ కుమార్, బాబావలితో పాటు పలువురు కార్మికులను బలవంతంగా అరెస్టు చేసి పోలీసు వాహనంలో ఎక్కించారు. అరెస్టులను కార్మికులను ప్రతిఘటించారు. పోలీసు వాహనం కదలడానికి వీలు లేకుండా మహిళ కార్మికులు కారు ముందు బైఠాయించి అడ్డుకున్నారు. అనంతరం సిఐతో పాటు పోలీసులు వారిని అడ్డుతొలగించి నాయకులను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. దీంతో కార్మికులు కలెక్టరేట్ నుంచి పట్టణ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ చేపట్టి అక్కడ ఆందోళన చేపట్టారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. అనంతరం పోలీసులు అరెస్టు చేసిన వారిని సొంతపూచీకత్తుపై స్టేషన్ బెయిల్ ఇచ్చి విడుదల చేశారు. 9న జరిగే సమావేశం అనంతరం సమస్యలు పరిష్కారం కాకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేయాలని యూనియన్ నాయకులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, సిద్ధు, కుళ్లాయప్ప, నాగమ్మ, అక్కులప్ప, కదిరప్ప, సజ్జ రామప్ప, భాగ్యమ్మ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు శ్రేయస్కరం

ప్రజాశక్తి-హిందూపురం

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం అని చిన్నపిల్లల వైద్యులు శ్రీకాంతి పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రి చిన్నపిల్లల విభాగంలో చిన్నపిల్లల సివిల్ సర్జన్ డా॥లింగన్న ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల విశిష్టత గురించి తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఆఫ్తాబ్, కీర్తి, సుకన్య, హేమ, పిపి యూనిట్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెజ్లింగ్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన పాంచజన్య విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్ హైస్కూల్ విద్యార్థులు గ్రాప్లింగ్ రెజ్లింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ఛాంపియన్‌గా నిలిచి, జాతీయ స్థాయికి ఎంపిక అయినట్లు పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు తెలిపారు. ఛాంపియన్‌గా నిలిచిన విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 29, 30న 3వ రాష్ట్ర స్థాయిలో సబ్ జూనియర్ బాల బాలికల గ్రాప్లింగ్ రెజ్లింగ్ ఛాంపియన్ షిప్-2023 పోటీలు అనకాపల్లిలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారన్నారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. పాఠశాల తరపున 7వ తరగతి చదువుతున్న ధనుంజయ్, షేక్ యాహియా పాల్గొని ఆటలో మంచి ప్రతిబా కనబర్చి బంగారు పథకం సాధించడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారన్నారు. విద్యతో పాటు పాఠశాలలో క్రీడలకు అధిక ప్రాధన్యత ఇవ్వడంతో తమ పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లోను ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నంద కుమార్, హెచ్ఎం గాయత్రి, ఎఒ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, షేక్ అబ్దుల్ రజాక్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్‌లో బంగారు పథకాలు

అనాకపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయిలో జరిగిన ఎపి స్టేట్ సబ్ జూనియర్ రెజ్లింగ్ రాప్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో హిందూపురం విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో కోచ్ రమేష్ ఆధ్వర్యంలో 10 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 9 మంది వివిధ రెజ్లింగ్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించి, ఆల్ ఇండియా క్రాప్లింగ్ కమిటీ ఛైర్మన్ దినేష్ కపూర్ చేతుల మీదుగా పతకాలు అందుకున్నారు. వీరిని ప్రజా సంఘం నాయకులు చైతన్య గంగిరెడ్డి, లైఫ్ వరల్డ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఉదయ్ కుమార్, ఎస్‌డిజిఎస్ కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర తదితరులు అభినందించారు.



క్రీడకారులను అభినందిస్తున్న పాంచజన్య శ్రీనివాసులు, ఉపాద్యాయులు



సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మినేని

దేశానికి వెన్నెముక వ్యవసాయ రంగం

రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

దేశ ఆర్థిక అభివద్ధి, వ్యవసాయ రంగం వెన్నెముక లాంటిదని రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో సిఆర్ మీడియా అకాడమీ జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో వ్యవసాయ రంగం సంస్కరణలు అనే అంశంపై రైతులతో చర్చాగోష్టి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొమ్మినేని తో పాటు జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ అవుతల రమణారెడ్డి, పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వ్యవసాయ అధికారి సుబ్బారావు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొమ్మినేని మాట్లాడుతూ దేశంలో 62 శాతం ప్రజల జీవనధారం వ్యవసాయ రంగం అన్నారు. ఆర్థిక వ్యవస్థకు రైతులు, కౌలు రైతులు ఆయువు పట్టు లాంటి వారన్నారు. గడిచిన నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం 52.38 లక్షల కుటుంబాలకు 27 వేల కోట్లు ప్రభుత్వం వివిధ పథకాల కింద రైతులకు అందించిందన్నారు. రాష్ట్ర సిరికల్చర్ రీఛార్జ్ డైరెక్టర్ డాక్టర్ సీతారాములు, వ్యవసాయ శాస్త్ర నిపుణులు డాక్టర్ కృష్ణ, డాక్టర్ శ్రీనాథ్ వ్యవసాయ రంగ ప్రాధాన్యత గురించి వివరించారు. తరువాత రైతులతో ఇష్టా గోష్టి చర్చలు జరిపారు. జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం సాధారణ విస్తీర్ణం 2.84 లక్షల హెక్టార్లు ఉండగా, ఇప్పటివరకు 65 వేల హెక్టార్లలో రైతులు వివిధ పంటల సాగు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ జేడీ పద్మమ్మ, ఏపీ ఎంఐపి పీడీ సుదర్శన్, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై కొమ్మినేని అసహనం

రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా అసహనం వ్యక్తం చేశారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్‌లు ఎందుకు మంజూరు చేయడం లేదని జర్నలిస్టులు ప్రశ్నించారు. 30 ఏళ్లుగా పనిచేస్తున్న జర్నలిస్టులకు అన్యాయం జరిగిందన్నారు. ఒక పత్రికకు మాత్రమే అడిగినన్ని మంజూరు చేస్తున్న ప్రభుత్వ అధికారులు మిగతా పత్రికల పట్ల ఎందుకు వివక్ష చూపుతున్నారని నిలదీశారు. ఈ ప్రశ్నలతో కొమ్మినేని విలేకరులపై అసహనం వ్యక్తం చేశారు. సమస్యలను ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని, ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలని తాను నిస్సహాయున్ని అని చెప్పి విలేకరుల సమావేశం ముగించారు.

టిడిపి నేతలతో చంద్రబాబు సమీక్ష

ప్రజాశక్తి-కదిరి టౌన్, మడకశిర

సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు చేపట్టిన యుద్ధభేరి యాత్ర ఉమ్మడి అనంతపురం జిల్లాలో ముగిసింది. గురువారం నాడు ఆత్మకూరు, పెనుకొండ, కదిరి ప్రాంతాల్లో పర్యటించారు. గురువారం రాత్రి కదిరి నియోజకవర్గం కొక్కంటి క్రాస్ సమీపంలోని పోలం సిద్ధారెడ్డి ఫంక్షన్ హాల్‌లో బస చేశారు. శుక్రవారం ఉదయం విడిది కేంద్రంలో ఉమ్మడి అనంతపురం జిల్లా నేతలతో సమావేశం అయ్యారు. జిల్లాలో రాజకీయ పరిస్థితులు, పార్టీ పరిస్థితులపై చర్చించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ భవిష్యత్తులో పార్టీ అనుసరించిన విధానాలపై దిశానిర్దేశం చేశారు. పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లేలా నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాల టిడిపి అధ్యక్షులు బికె.పార్థసారథి, కాలవ శ్రీనివాసులు, మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథ్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు కందికుంట వెంకటప్రసాద్, పరిటాల శ్రీరామ్, మాదినేని ఉమామహేశ్వర నాయుడు, వైకుంఠం ప్రభాకర్ చౌదరి, జితేంద్రగౌడ్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా టిడిపి నాయకులు

ఆశాలపై వేధింపులు ఆపండి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో గైనకాలిస్టులు రెఫర్‌ల పేరుతో ఆశ వర్కర్ల పేరుతో వేధిస్తున్నారని, ఈ వేధింపులు ఆపాలని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప తెలిపారు. శుక్రవారం అసుపత్రి సుపరింటెండెంట్ రోహిల్‌కు ఈ విషయంపై ఆశ వర్కర్లు సిఐటియు నాయకులతో కలిసి వినతిని ఇచ్చారు. ఈ సందర్భంగా నరసింహప్ప మాట్లాడుతూ ఆశ వర్కర్లు కాన్పు కోసం తీసుకొచ్చిన గర్భిణులను స్థానిక వైద్యులు అనంతపురం రెఫర్ చేస్తున్నారన్నారు. వీరిని అనంతపురం తీసుకెళ్తే సాధరణ కాన్పులు అవుతున్నాయన్నారు. అక్కడి వైద్యులు హిందూపురం అసుపత్రిలో సాధరణ కాన్పులు సైతం చేయడం లేదా అంటు తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇది చాలదన్నట్లు రెఫర్ చేసిన వారిని అనంతపురం తీసుకెళ్తున్న సమయంలో మార్గ మధ్యలోనే కాన్పులు అవుతున్నాయన్నారు. ప్రయివేటు ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారని చెప్పారు. వీటిపై సమగ్ర ధర్యాప్తు జరిపి, రెఫర్‌లు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామకృష్ణ, ఆశ వర్కర్లు మమతమ్మ, జానకి, జ్యోతి, లక్ష్మి, ప్రశాంతమ్మ, బీబిజాన్, నసిమా, అయిషా, జబీనా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అసుపత్రి సుపరిటెండెంట్ రోహిల్‌కు వినతిని ఇస్తున్న ఆశా కార్యకర్తలు

విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తేనే గుర్తింపు : దీపిక



విద్యార్థులను అభినందిస్తున్న దీపిక

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే జాతీయ, అంతార్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దీపిక అన్నారు. పట్టణంలోని వివేకానంద మిలీనియం పాఠశాల విద్యార్థులు షేక్ సిఫా అంజుమ్, రక్షిత్‌లు నేషనల్ త్రో బాల్ ఛాంపియన్ షిప్ పోటీలలో ద్వితీయ స్థానం సాధించారు. వారిని పాఠశాలలో శుక్రవారం దీపిక అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బైసాని రాంప్రసాద్, చిలమత్తూరు ఎంపిపి పురుషోత్తం రెడ్డి, స్థానిక కౌన్సిలర్ గిరి, రాష్ట్ర సహాయ కార్యదర్శి హనుమంత్ రెడ్డి, కొల్లకుంట ఆనందరెడ్డి, నక్కలపల్లి శ్రీరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవును నేను 'తోపు'నే..! : ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

'అవును నేను తోపునే... మీ హయంలో చేయలేని పనులను నేను చేసి చూపించాను.' అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. తనకు రెండు వేల కోట్లు ఆస్తులున్నాయని చంద్రబాబు నాయుడు ఆరోపించడాన్ని తప్పుబట్టారు. తనకు రూ.20 కోట్లు డబ్బులిస్తే తక్కిన రూ.1980 కోట్లు వారికి రాసిచ్చేస్తాను అను రిజిస్ట్రేషన్ బాండ్ పేపరుపై సంతకాలు చేశారు. దీన్ని వారికి అందజేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ప్రాజెక్టులపై చంద్రబాబు నాడు పర్యటన అనంతరం ఆయన స్పందించారు. శుక్రవారం ఉదయం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టుల్లో దోచుకున్నది చంద్రబాబునాయుడు అని ఆరోపించారు. పేరూరు పెన్నా నది నుంచి నీరు తీసుకురావచ్చునని చెప్పినా పట్టించుకోలేదన్నారు. తాము అధికారంలోకి వస్తూనే అదే రకంగా ఇచ్చి చూపించామని చెప్పారు. సహకార అమ్మ డెయిరీని ఏర్పాటు చేసి పాడి రైతులను ఆదుకునే చర్యలు చేపట్టామని వివరించారు. పేదలకు చదరపు అడుగు రూ.800 చొప్పున ఇళ్ల నిర్మాణాలను చేపట్టి ఇస్తున్నామని తెలిపారు. రెండు వేల కోట్లు దోచుకున్నట్టు చంద్రబాబునాయుడు ఆరోపించారని గుర్తు చేశారు. రూ.20 కోట్లు ఇచ్చి ఆ ఆస్తులన్నీ మీరే తీసుకోవచ్చునని సవాల్ విసిరారు. రహదారు వెంట భూములున్నది తమకు కాదని, పరిటాల సునీతకేనని చెప్పారు. దొంగదెబ్బతీయాలంటూ టిడిపి నేతలను పరోక్షంగా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఫ్యాక్షన్ బాధిత కుటుంబాల పిల్లలను ఎన్టీఆర్ ట్రస్టులో చదివించి వారిని ఫ్యాక్షనిస్టులుగా మారుస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబునాయుడుకు వయసుతోపాటు బుద్ధి మందగించిందని మండిపడ్డారు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చే అవకావమే లేదని విమర్శించారు.


రూ.కోటితో ఆలయ అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపూరం రూరల్ మండలం చలివెందుల గ్రామపంచాయతీ రాచపల్లి గ్రామంలో యువ నాయకులు మహేంద్రనాథ్ రెడ్డి, గ్రామస్తులు రాచపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ అభివద్ధికి నిధుల గురించి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపికా దష్టికి తీసుకెళ్లరు. వెంటనే ఆమె స్పందించి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం మహేందర్ రెడ్డి, గ్రామస్తుల ఆహ్వానం మేరకు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రాస్తులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసి బాణాల శ్రీనివాసరెడ్డి, చిలమత్తూరు ఎంపిపి పురుషోత్తం రెడ్డి, కొల్లకుంట ఆనంద రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంత్ రెడ్డి, నక్కలపల్లి శ్రీరామ్ రెడ్డి, మోడల్ స్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

గడపగడపకూ కార్యక్రమంలో పాల్గొన్న దీపిక

ప్రభుత్వం ప్రజల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని నియోజక వర్గ సమన్వయ కర్త, ఇన్‌ఛార్జ్ దీపిక తెలిపారు. శుక్రవారం రూరల్ మండలం కొటిపి పంచాయతీ కంచనపల్లి గ్రామంలో గడగపగడగపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దీపిక ప్రజలను కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. టిడిపి తరపున గెలచిన వార్డు మెంబర్ సౌభాగ్యమ్మతో పాటు మరి కొంత మంది వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి కె.సరస్వతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంత్ రెడ్డి, బసిరెడ్డి, నక్కలపల్లి శ్రీరామ రెడ్డి, ఆదెప్ప, కౌన్సిలర్ మణి, షాజియా, మారుతి రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



దీపికతో పాటు వైసిపి కౌన్సిలర్లును సన్మానిస్తున్న గ్రాస్తులు



ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని కలిసిన పుడా వైస్ చైర్మన్ బండి శేషన్న

బాధ్యతలు చేపట్టిన పుడా వైస్ చైర్మన్

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పుడా) వైస్ చైర్మన్‌గా శుక్రవారం బండి శేషన్న బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన పుట్టపర్తిలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టపర్తి అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. అలాగే పుడా పరిధిలో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వెల్ఫేర్ అసిస్టెంట్‌కు సన్మానం

రొళ్ల : మండల పరిధిలోని రత్నగిరి గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి బదిలీపై చిలమత్తూరు సచివాలయం-3కి వెళ్తున్న మారుతిని శుక్రవారం రత్నగిరి గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు శాలువా లు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచి చిన్నరంగప్ప, పంచాయతీ కార్యదర్శి రవన, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ తిమ్మారెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

7న డివిజన్ స్థాయి స్పందన

గుడిబండ : ఈ నెల 7వ తేదీ స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు డివిజన్ స్థాయి స్పందన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ రామారావు తెలిపారు. అందులో అన్ని శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను తెలిపితే పరిష్కరిస్తారని తెలిపారు.

40 ఏళ్ల ఏకగ్రీవ సర్పంచి కన్నుమూత

ముదిగుబ్బ : మండల పరిధిలోని చిన్నకోట్ల గ్రామ మాజీ సర్పంచి సాయినాథ్‌రెడ్డి అనంతపురం నగరంలోని సాయి నగర్‌లో తన నివాసంలో శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు కన్నుమూశారు. ఆయన గతంలో 40 ఏళ్ల పాటు ఏకగ్రీవ సర్పంచిగా చిన్నకోట్ల గ్రామ ప్రజలకు సేవలు అందించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఆయన మృతి పట్ల గ్రామ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

6న పర్యావరణ మిత్ర స్ఫూర్తి పురస్కారాల ప్రదానం

పెనుకొండ : జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ హిందూపురంలో నిర్వహిస్తున్న పర్యావరణ జాతీయ కవితోత్సవంలో 12 మంది పర్యావరణ పరిరక్షకులకు పర్యావరణ మిత్ర పురస్కారాలు అందజేస్తామని అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కవితోత్సవానికి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సుమారు వంద మంది కవులు హాజరై పర్యావరణ పరిరక్షణపై కవితలు చదువుతారన్నారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కార్యనిర్వాహకులు ఉమర్‌ఫారుక్ కోరారు.

రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరటపై హర్షం

గోరంట్ల : పరువు నష్టం కేసులో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీకి సుప్రీం కోర్టులో ఊరట లభించడంతో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రాజారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో రెండేళ్ల జైలు శిక్షపై స్టే విధించి సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు తీర్పు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

బదిలీ పోలీసులకు సన్మానం

గోరంట్ల : స్థానిక పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది బదిలీ అయిన సందర్భంగా సిఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో సన్మానించారు. ఎస్ఐ ఇబ్రహీం, ఎఎస్ఐలు నక్షప్ప, శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్, కానిస్టేబుళ్లు గోవర్ధన్, భగవాన్, నారాయణస్వామి, కేశవరెడ్డి, రమణకుమార్, సుధాకర్ ఇతర మండలాలకు బదిలీ కాగా సిఐ ఆధ్వర్యంలో సన్మానించారు.

10 నుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కొత్తచెరువు: ఈ నెల 10వ తేదీ నుంచి మండల వ్యాప్తంగా వైద్యాధికారి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, కళాశాలల్లో 19 ఏళ్ల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు ఎంపిడిఒ సిద్దారెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీటిని వాడడం వల్ల నులిపురుగుల నివారణ చెందితే, శరీరకంగా ఎదుగుదలకు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నరసింహులు, ఎంపిహెచ్‌ఈఒ లాలునాయక్, కార్యదర్శి గంగాధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు చేపల చెరువుల వేలం

కదిరి రూరల్ : మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి పంచాయతీకి చెందిన చెర్లోపల్లి చెరువు, వన్నెచెరువు, చిన్నారప్పకుంట, భద్రకుంట, కొర్తేడిచెర్వు కుంటల్లో చేపల పెంపకానికి శనివారం(నేడు) వేలం పాట నిర్వహిస్తున్నట్లు శుక్రవారం బ్రాహ్మణపల్లి పంచాయతీ కార్యదర్శి గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ సర్పంచి షేక్ కుషేదాబి ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నాం, ఆసక్తి కలిగిన వారు రూ. 500 ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చు అన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ముఖ్యం

ఎమ్మెల్యే కేతిరెడ్డి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

నియోజకవర్గ అభివృద్ధే తనకు ముఖ్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని గుడ్డంపల్లి తండా సమీపంలో నిర్మిస్తున్న జిల్లేడుబండ ప్రాజెక్ట్ ముంపు ప్రాంత రైతులతో శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి టీవీ మానిటర్ ద్వారా జిల్లేడు బండ ప్రయోజనాలను చిత్రాల రూపంలో ప్రదర్శించారు. అలాగే డ్యాం ద్వారా నీటి నిల్వతో రాబోవు రోజుల్లో పరిశ్రమల ఏర్పాటు, చుట్టుపక్కల పొలాలకు ఎడమ, కుడి కాలువల ద్వారా నీటి సరఫరా గురించి వివరించారు. ముఖ్యంగా డ్యాం పనులు ఒక కి.మీ మాత్రమే జరిగాయని, ఇంకా 7 కి.మీ. మేర పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ముంపు



టీవీ మానిటర్ ద్వారా రైతులకు వివరిస్తున్న కేతిరెడ్డి

గ్రామాల రైతులకి నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని, లేనిచో పనులు ఆపిస్తాను అని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు రైతులు ఎమ్మెల్యేకి సమస్యలు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఇందుకూరు నారాయణరెడ్డి, జడ్పిటిసి తిరుమల సేవే నాయక్, జిల్లేడు బండ ప్రాజెక్టు అధికారులు, పలు గ్రామాల రైతులు, వైసిపి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'గడపగడపకూ'తో బాధ్యత పెరిగింది

ప్రజాశక్తి-కదిరి టౌన్

వైసిపి చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వంతో మరింత బాధ్యత పెరిగిందని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే జన్మదినం, గడప గడపకూ మన ప్రభుత్వం ముగింపు సందర్భంగా శుక్రవారం పట్టణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు అంబేద్కర్ సర్కిల్ నుంచి జీవిమాను సర్కిల్, చౌక్, హిందూపూర్ సర్కిల్, టవర్ క్లాక్, కాలేజ్ సర్కిల్ నుంచి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు ఎమ్మెల్యే వైసిపి శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో 206 రోజుల పాటు పర్యటించి



కదిరి ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

1,00,516 గడపలను సందర్శించామన్నారు. దిగ్విజయంగా పూర్తి కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో 'ప్రయివేటు' ప్రతిభ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఎస్కే యూనివర్సిటీ డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో పట్టణంలోని సత్యకప మహిళా డిగ్రీ, శ్రీసాయి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు ఆ కళాశాలల ప్రిన్సిపల్స్ తెలిపారు. సత్యకప కళాశాలలో బీఎస్సీ గ్రూపులో మౌనిక, చంద్రిక 96శాతం, కీర్తి 95శాతం, వెంకటలక్ష్మీ 94 శాతం, సంధ్యారాణి 93శాతం, శ్రావణి 92శాతం, బీబీఏలో అక్షయ 81శాతం, కరిష్మా 78శాతం, ప్రసన్న, తహసీనా, ప్రత్యుష 75శాతం మార్కులు సాధించారని కరస్పాడెంట్ డోలా పెద్దిరెడ్డి, ప్రిన్సిపల్ మల్లికార్జున తెలిపారు. వీరికి శుక్రవారం కళాశాలలో స్వీట్లను తినిపించి అభినందనలు తెలిపారు. అలాగే శ్రీసాయి డిగ్రీ కళాశాలలో బీఎస్సీ గ్రూపులో దహీన 93శాతం, మౌనిక 91శాతం, శ్వేత 88శాతం,



విద్యార్థినులకు స్వీట్లు తినిపిస్తున్న సత్యకృప కరస్పాండెంట్ డోలా పెద్దిరెడ్డి, ప్రిన్సిపల్ మల్లికార్జున



సెమిస్టర్ ఫలితాల్లో సత్తా చాటిన శ్రీసాయిడిగ్రీ కళాశాల విద్యార్థులు

ప్రేమకుమార్ 86శాతం, జగదీశ్ 85శాతం, యశస్విని 83శాతం, నందసాయినాథ్, పార్థసాయి 82శాతం, లావణ్య, జయక్రిష్ణ 81శాతం, బీకాం, బీబీఏలో యాసిన్, మేఘశ్యామ్ 90శాతం, శ్రీనివాసులు, ముఖేశ్వర్‌రెడ్డి 88శాతం, నవీన్‌కుమార్, సతీష్‌కుమార్ 83శాతం, లోకేశ్ 84శాతం, రమ్యశ్రీ, సమీర్‌నవాజ్, నందు 82శాతం, వెంకటేశ్, షామిన్ ముస్కీన్, శ్రీజ 81శాతం, మనీష, గౌసియా 80శాతం, ఆయేషాఇమాన్ 79శాతం, నిఖిల్‌రెడ్డి, తస్లీమ్ 78శాతం, గణేష్‌కుమార్ 76శాతం, రాహిన్, ప్రేమాన్విత, బాలాజీ, మహేశ్వర్, కరుణేష్ 75శాతం మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ చాంద్‌బాషా, ప్రిన్సిపల్ ఫణికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు.

అమరావతిలో ఇళ్ల విషయంలో న్యాయస్థానం పున:పరిశీలించాలి

వైసిపి లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి -పెనుకొండ

అమరావతిలో పేదల ఇళ్ల నిర్మాణాల విషయంలో న్యాయస్థానం పున్న పరిశీలించాలని వైసిపి జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కర్ రెడ్డి కోరారు. ఆయన శుక్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ అమరావతి లో పేదల ఇళ్ల నిర్మాణానికి సంబంధించి కొందరు ప్రతిపక్ష పార్టీల నాయకులు హైకోర్టులో అనుబంధ పిటిషన్లు వేయించడం తో హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల తీర్పును గౌరవించాల్సిందేనని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. అటువంటి పరిస్థితుల్లో ఈ తీర్పు ను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ ఫైల్ చేస్తుందని, ఖచ్చితంగా పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆశాభావంవ్యక్తం చేశారు.

అప్పర్ భద్ర ప్రాజెక్ట్‌తో సీమ జిల్లాలకు అన్యాయం

ప్రజాశక్తి-మడకశిర

కర్నాటక ప్రభుత్వం నిర్మించదలచిన అప్పర్ భద్ర ప్రాజెక్ట్ వల్ల రాయలసీమ జిల్లాలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కృష్ణా, తుంగభద్ర నీటి లభ్యతపై ఆధారపడిన శ్రీశైలం ప్రాజెక్టు ఎగువన కర్నాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్ట్ వల్ల ఏపీలోకి తుంగభద్ర నీరు వచ్చే అవకాశం ఉండదని, తద్వారా కేవలం కృష్ణానది నీటిపైనే ఆధారపడాల్సి వస్తోందన్నారు. రాయలసీమకు మరణ శాసనం లాంటి అప్పర్ భద్ర ప్రాజెక్ట్‌ను అడ్డుకోవాల్సిన వైసిపి ప్రభుత్వం, సిఎం జగన్ అభ్యంతరం వ్యక్తం చేయకపోవటం విచారకరం అన్నారు. జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సాగునీటి పెండింగ్ ప్రాజెక్టులు, పోలవరం ప్రాజెక్టు, అప్పర్ భద్ర ప్రాజెక్ట్ గురించి మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.



సచివాలయాల్లో కనపడని సమాచార బోర్డు

నంబులపూలకుంట : ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద తప్పనిసరిగా సమాచార చట్టానికి సంబంధించిన బోర్డు ఉండాలి. ఆ బోర్డులో సమాచారం ఎవరికి ఇవ్వాలి, వారి పేరు, మొబైల్ నెంబరు ఏర్పాటు చేస్తే ప్రతి పౌరుడు స్వచ్ఛందంగా సమాచారం అడిగి తెలుసుకోవచ్చు. కానీ మండల కేంద్రమైన నంబులపూలకుంటలోని సచివాలయాల వద్ద ఎలాంటి బోర్డు ఏర్పాటు చేయలేదు. అలాగే వివిధ ఫిర్యాదు నంబర్లు, ఏ పథకాలు ఎన్ని రోజులు అందుతాయి, పంచాయతీకి సంబంధించిన వివరాలు అందుబాటులో లేవు. ఈ విషయాన్ని పలుమార్లు పంచాయతీ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి సమాచార హక్కు చట్టం బోర్డు, ఫిర్యాదు నంబరు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యాధి నిరోధక టీకాలను సద్వినియోగం చేసుకోండి

జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

'మిషన్ ఇంద్రధనస్సు'లో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి సూచించారు. ప్రశాంతి గ్రామ్‌లోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ నెలలో 7 నుంచి 12వ తేదీ వరకూ, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో రెండవ వారంలో ఆరు రోజులు పాటు 0-18 సంవత్సరాల లోపు వారికి వ్యాధి నిరోధక టీకాలు వేస్తారని, గతంలో వేయించుకోని వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వ్యాక్సినేషన్ సర్టిఫికెట్ కూడా మంజూరు చేస్తారని తెలిపారు. అలాగే చిన్నపిల్లల్లో నులి పురుగు నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రల ను జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, పాఠశాలలు, అంగన్వాడీలకు సరఫరా చేశామన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి రెవెన్యూ కార్యాలయం వెనుక గుట్టపై ఉన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని కోరారు. ఆయన శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కాలనీలో ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు రాగా స్పందించిన ఆయన గృహ నిర్మాణ లబ్ధిదారులకు నీటి వసతి కల్పించాలని, బిల్లులు మంజూరు విషయంలో జాప్యం జరగకుండా చూడాలని, నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో ఆపకుండా సత్వరమే చర్యలు చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట జడ్పిటిసి లక్ష్మీనరసమ్మ, ఎంపిపి రమణారెడ్డి, మండల కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, వైస్ ఛైర్మన్ తిప్పన్న, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు తిరుపాల్‌నాయక్, కౌన్సిలర్లు సాయిగీత, నారాయణరెడ్డి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి

రొళ్ల : చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని హైపర్ సంస్థ ఛైర్మన్ ఆనంద్‌నాయక్, ఐఎఫ్‌హెచ్‌డి సంస్థ ఛైర్మన్ దేవి ఈశ్వరప్ప పేర్కొన్నారు. రొళ్ల కామధేను ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని పి.గొల్లహట్టి, పిల్లిగుండ్లు, రంగనపల్లి గ్రామాలకు చెందిన రైతులకు వెయ్యి మొక్కలను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 2వేల మొక్కలను నాటడమే ఉద్దేశమని వారు తెలిపారు. మొదటి విడతలో వేప, మామిడి, జామ, నిమ్మ చెట్లను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రతి రైతు పొలం గట్లపై, బీడు భూముల్లో విరివిగా మొక్కలను పెంచి పోషించాలని సూచించారు. కార్యక్రమంలో వాసుదేవరెడ్డి, హనుమంతరెడ్డి, కవిత, శ్రీనివాస్‌గౌస్, కామధేను ఆఫీస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబు కాన్వాయ్‌పై దాడి దారుణం

జిల్లా టిడిపి అధ్యక్షులు బికె పార్థసారథి

ప్రజాశక్తి-పెనుకొండ


చిత్తూరు జిల్లాలోని పుంగనూరు, అంగల్లులో చంద్రబాబు కాన్వాయ్‌పై వైసిపి మూకల దాడి దారుణమని జిల్లా టిడిపి అధ్యక్షులు బికె పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 'రామచంద్రారెడ్డి పుంగనూరు నీ జాగీరు కాదు ఖబర్దార్ అని హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని పోలీసు వ్యవస్థ అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేస్తుందని ధ్వజమెత్తారు. జడ్ ప్లస్ కేటగిరీ కలిగిన మాజీ ముఖ్యమంత్రి ముందస్తు సమాచారం మేరకు పర్యటిస్తుంటే రక్షణ లేకపోతే సామాన్య మానవుని పరిస్థితి ఏంటని గుర్తు చేశారు.

పిరికిపంద చర్య : 'పల్లె'

పుట్టపర్తి అర్బన్ : బాబు కాన్వాయ్‌పై దాడి పిరికిపంద చర్య అని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న చంద్రబాబు తీరుపై జీర్ణించుకోలేక మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు దాడికి దిగడం దుర్మార్గం అన్నారు. పుంగనూరు పెద్దిరెడ్డి జాగీరు కాదని టిడిపి కార్యకర్తలు తిరగబడితే ఒక్కరు కూడా మిగల లేరు అన్నారు. ఈ చర్యకు పెద్దిరెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వైసిపి గూండాలను అరెస్టు చేయాలి : గుండుమల

మడకశిర : చంద్రబాబుపై దాడిని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తీవ్రంగా ఖండించారు. ఇలాంటి చర్యలు టిడిపి హయాంలో చేసుంటే జగన్ పాదయాత్ర చేసి ఉండేవారా అని పెద్దిరెడ్డిని ప్రశ్నించారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు చేస్తే తగిన రీతిలో బదులిస్తామని హెచ్చరించారు. కవ్వింపు చర్యకు పాల్పడిన వైసిపి గూండాలను వెంటనే అరెస్టు చేయాలన్నారు. రౌడీ ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి సాగనంపుతారన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బికె పార్థసారథి

వైసిపివి కవ్వింపు చర్యలు : 'కందికుంట'

కదిరి టౌన్ : చిత్తూరులో వైసిపి అల్లరి మూకలు టిడిపి ఫ్లెక్సీలు, జెండాలు చించడం పట్ల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపికి ప్రజల్లో లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేని వైసిపి కవ్వింపు చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం ఏంటని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం దాడిని ఖండిస్తూ స్థానిక జ్యోతిరావు పూలే సర్కిల్‌లో కందికుంట ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. సిఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికార మదంతో దాడులు చేయిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి త్వరలోనే మూల్యం చెల్లించకోక తప్పదని హెచ్చరించారు.

ఓటమి భయంతోనే దాడులు : సవితమ్మ

పెనుకొండ : సిఎం జగన్ నుంచి గ్రామస్థాయి వరకూ వైసిపి నేతలకు ఓటమి భయం పట్టుకుందని, ఈ క్రమంలోనే చంద్రబాబు కాన్వాయ్‌పై దాడికి పాల్పడ్డారని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణం లోని తన కార్యాలయంలో ఆమె మాట్లాడు తూ దాడి సమయంలో విధుల్లో ఉన్న పోలీసులను సస్పెండ్ చేయాలని, దాడికి డిజిపి సమాధానం చెప్పాలన్నారు. దాడులకు టిడిపి ఏనాడూ భయపడలేదని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసిపికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. దాడులకు పాల్పడిన వైసిపి మూకలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

దాడి ఆటవిక చర్య

తనకల్లు : చంద్రబాబు కాన్వాయ్‌పై దాడి ఆటవిక చర్య అని టిడిపి నాయకులు పేర్కొన్నారు. మండల పరిధిలోని కొక్కంటి క్రాస్‌లో టిడిపి నాయకులు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఇటువంటి చర్యలు హేయమైనవి అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఇటువంటి చర్యలను ప్రోత్సహించడం రాజ్యాంగ విరుద్ధమని, వెంటనే దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులను సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి మల్లికార్జున, చంద్ర, శంకర, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వేతనాల చెల్లింపులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయచంద్ర రెడ్డి మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు శుక్రవారం సాయంత్రం యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కొత్తచెరువులోని డీఈవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ ముగిసి రెండు నెలలు పూర్తయినా, రాష్ట్రవ్యాప్తంగా 60 వేల మందికి సక్రమం గా వేతనాలు చెల్లించకపోవడాన్ని తీవ్రంగా



వేతనాలు కోసం నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

ఖండిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతు న్నారని, వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు బూతన్న, కోశాధికారి సుధాకర్, జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, తాహిర్‌వలి, శ్రీనివాసులు, శివ, లక్ష్మీనారాయణ, బాబయ్య, రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటించండి

ప్రజాశక్తి-కొత్తచెరువు

పంటలు సాగు చేసే రైతులు వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని శిక్షణ ఎడిఎ సనావుల్లా సూచించారు. మండల పరిధిలోని కొడపగానిపల్లె రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం పొలంబడిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ బోరుబావుల కింద పంటలు సాగు చేసే రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. తగు మోతాదులోనే మందులను పంటలకు వాడాలన్నారు. తక్కువ పెట్టుబడి పెట్టి అధిక దిగుబడి సాధించాలన్నారు.



పొలంబడి నిర్వహిస్తున్న ఎడిఎ సనావుల్లా

అనంతరం రైతుల పొలాల్లోకి వెళ్లి ఈ పద్ధతుల గురించి వారికి తెలియజెప్పారు. కార్యక్రమంలో సింగిల్‌విండ్ అధ్యక్షులు రఘునాథరెడ్డి, సర్పంచి అలివేలమ్మ, ఎంపిటిసి వరలక్ష్మి, ఎఒ నటరాజు, విఎఎలు సాయికౌశిక్, ధనుంజయ పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటా

ప్రజాశక్తి-పెనుకొండ

వైసిపి నాయకులు, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటానని నియోజకవర్గ నాయకురాలు సానే ఉమారాణి పేర్కొన్నారు. ఆమె శుక్రవారం పట్టణంలోని మడకశిర రోడ్డులో ప్రత్యేకంగా కార్యాలయాన్ని ప్రారంభించి పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమారాణికి పలువురు మహిళలు, నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందజేసి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడు తూ నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని, ఏ కష్టం వచ్చినా తన వంతు సహకారం ఉంటుందన్నారు. అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా కష్టపడి పని చేస్తానని తెలిపారు.



పెనుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉమారాణి, నాయకులు

ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తురకలాపట్నం సర్పంచి నరేంద్రరెడ్డి, నాయకులు సజ్జారెడ్డి, చాలకూరు అశ్వర్థమ్మ, నాగభూషణ్‌రెడ్డి, ఎర్రయ్యగారిపల్లి చంద్ర, చిన్నపరెడ్డిపల్లి ప్రసాద్‌రెడ్డి, ముకుందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి-తనకల్లు

రాయలసీమలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులపై టిడిపి అధినేత చంద్రబాబు చేపట్టిన యుద్ధభేరి కార్యక్రమాన్ని కదిరిలో ముగించుకుని గురువారం రాత్రి 11.30 గంటలకు మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ వద్ద ఉన్న పోలం సిద్ధారెడ్డి ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన విడిది కేంద్రానికి చేరుకున్నారు. ఆయన రాక కోసం జాతీయ రహదా రిపై ఎదురుచూస్తున్న ప్రజానీకానికి అభివాదం చేస్తూ ముందుకుసాగారు. శుక్రవారం ఉదయం 10:30కు తన బస్సులో ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపి ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించి జిల్లాలో పార్టీ అనుసరించాల్సిన విధి, విధానాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశానికి బికె పార్థసారథి, కాలవ శ్రీనివాసులు, కందికుంట



చంద్రబాబుతో ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపి ఇన్‌ఛార్జులు

వెంకటప్రసాద్, పల్లె రఘునాథరెడ్డి, పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, వైకుంఠం ప్రభాకర్‌చౌదరి, జితేందర్‌గౌడ్, గుండుమల తిప్పేస్వామి, ఆలం నరసానాయుడు, మాదినేని ఉమామహేశ్వరనాయుడు హాజరయ్యారు. అనంతరం ఫంక్షన్ హాల్ వద్ద వేచి ఉన్న కార్యకర్తలు, నాయకులతో ముచ్చటించి వారి నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. అనంతరం చంద్రబాబు అన్నమయ్య జిల్లాకు తరలి వెళ్లారు.



సెల్ఫీ తీసి వంతెనను చూపెడుతున్న సామకోటి ఆది

రాయలవారిపల్లి వంతెనను బాగు చేయండి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మున్సిపాలిటీ పరిధిలోని రాయలవారి పల్లి గ్రామానికి పుట్టపర్తికి మధ్యలో ఉన్న వంతెన పునర్నిర్మాణం చేయాలని టిడిపి నాయకులు సామకోటి ఆదినారాయణ సెల్ఫీ తీసి ప్రభుత్వానికి తెలిపారు. ఆయన శుక్రవారం చిత్రావతి నదిపై తెగిపో యిన వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది కురిసిన వర్షాల కారణంగా రాయలవారిపల్లి వంతెన తెగిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి త్వరగా వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఆయన వెంట నాయకులు, ప్రజలు ఉన్నారు.

గ్యాస్ ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

కొత్తచెరువు : మండల పరిధిలోని వంగంపల్లి గ్రామానికి చెందిన మాధవరాజు భార్య రాజేశ్వరి(40) ఇంట్లో వంట గ్యాస్ లీకై మంటలు చెలరేగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఆమె కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరులు అరెస్టు

మడకశిర : ఎస్ఐ లోకేశ్ శుక్రవారం సిబ్బందితో కలిసి మండల పరిధిలోని దొడ్డేపల్లి గ్రామ సమీప పొలాల్లో జూద స్థావరంపై దాడులు చేసి కర్నాటక, ఇతర ప్రాంతాలకు చెందిన ఐదుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 73,400 నగదు, 4 మొబైల్ ఫోన్లు, 3 ద్వి చక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వేరుశనగ పంట పరిశీలన

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో సాగు చేసిన వేరుశనగ పంటలను శుక్రవారం ఏరువాక శాస్త్రవేత్త రామసుబ్బయ్య, ఎఒ సి.వెంకటబ్రహ్మం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వేరుకుళ్లు, కాండం కుళ్లు నివారణకు పిచికారి చేయాల్సిన మందుల గురించి వివరించారు. అలాగే వేరుశనగ పంట పూతదశ సమయంలో జిప్సం వేసుకోవడం వల్ల గింజలో నూనెశాతం, కాయ సైజు పెరిగి, దిగుబడి ఎక్కువ రావటానికి అవకా శం వుంటుందని తెలిపారు. అలాగే కొట్లపల్లి గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. పంట 30 రోజుల సమయంలో ఎకరాకు 50 కిలోల యూరియాను పై పాటుగా తప్పకుండా వేసుకోవాలని సూచించారు. కత్తెరపురుగు నివారణకు మందు పిచికారి చేయాలన్నారు. వారి వెంట గ్రామ వ్యవసాయ సహాయకురాలు, సర్పంచి, రైతులు ఉన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ

లేపాక్షి : మండల పరిధిలోని కంచి సముద్రం గ్రామపంచాయతీ బయన్నపల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. గతంలో కురిసిన భారీ వర్షాల వల్ల కంచిసముద్రం నుంచి బయన్నపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో కల్వర్టు తెగిపోయింది. దీంతో ఆ బ్రిడ్జిని పునర్ నిర్మించడానికి శుక్రవారం నిర్వహించిన భూమిపూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హిందూపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణస్వామి, వైస్ ఎంపిపి అంజనరెడ్డి, సర్పంచులు అశ్వత్థనారాయణ, ఆదినారాయణ, మంజునాథ్, ఎంపిటిసిలు ఆదినారాయణ, బోర్ల అంజనరెడ్డి, కిషన్, చలపతి, వైస్ సర్పంచి వెంకటేష్ పాల్గొన్నారు.